RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in








సంపుటి -13 సంచిక - 477 | 24 సెప్టెంబర్ గురువారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--


### ఇది ఎల్ నినో కాదు..

# కాంగ్-నినో

## : రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు.
"కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### రేవంత్ రెడ్డికి నెల రోజుల

# డెడ్ లైన్

## విధించిన కవిత




ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

### తీరం దాటనున్న తీవ్ర వాయుగుండం..

# తెలంగాణకు రెడ్ అలర్ట్!



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో రాగల 48 గంటల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ సెప్టెంబర్ 23 (బుధవారం) రాత్రికి ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరంలో విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. వాయుగుండం ప్రభావంతో బుధవారం తెలంగాణలోని 8 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కొన్నిచోట్ల 20 సెంటీమీటర్లకు పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అలాగే కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గురువారం కూడా పలు జిల్లాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. మరోవైపు, రాజధాని హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో సెప్టెంబర్ 26 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ముషీరాబాద్ వంటి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అనవసర ప్రయాణాలు చేయవద్దని, లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.

### రైతుల పోరాటంతోనే

# ప్రభుత్వం దిగొచ్చింది

## : జూరాల నీటి విడుదలపై కేటీఆర్



జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

### తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

### రెండు డీఏలకు ప్రభుత్వం

# గ్రీన్‌సిగ్నల్



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది.
రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

# గవర్నర్ ను కలిసి వినతిపత్రం అందించిన జగన్



డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్




**మెదక్,సెప్టెంబర్23(హైద్రాబాద్ ఎస్టేట్):** మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస్ రావు జన్మ దినం సందర్భంగా బుధవారం రోజు మెదక్ జిల్లా యూత్ ఐకాన్ లీడర్ భువన్ కుమార్ ఎస్పీ కార్యాలయంలో కలిసి ప్రత్యేక శు భాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు, కృప కటాక్షాలు మీపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## గణేష్ లడ్డూ వేలం పాటలో 1,40,000 లడ్డును కైవసం చేసుకున్న మారేమోని రాజు యాదవ్




హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 23

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం దాసర్ల పల్లిగ్రామంలో పూజ్యులు రేవల్లి రాజు శర్మ ఆధ్వర్యంలో జరిగిన గణేశ లడ్డు వేలం పాటలో 1,40,000, రూపాయలకు మరేమోని రాజు యాదవ్ తగ్గించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ జంబుల దయాకర్, గ్రామ సర్పంచ్ టేకుమట్ల బాల్ రాజ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## లడ్డు వేలం పాటలో 51000 కైవశం చేసుకున్న కల్వకుల్ సర్పంచ్ బక్క నీ లక్ష్మమ్మ కుమారుడు బక్క నీ రవి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 23

ఈరోజు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో నవచైతన్య యువజన సంఘం వారి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడి వద్ద లడ్డు వేలం పాట నిర్వహించడం జరిగింది. ఈ వేలం పాటలో గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ గారి కుమారుడు బక్కని రవి మాదిగ పాల్గొని ఉత్కండ పరితంగా జరుగుతున్న వేలంపాటలో పాల్గొని 51,000ల తో లడ్డును కైవాసం చేసుకున్న గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ గారి కుమారుడు బక్కని రవి మాదిగ. విఘ్నేశ్వరుడు వారి కుటుంబాన్ని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మరి ఉన్నంత పదవులు వచ్చే విధంగా ఆశీర్వదించాలని వేడుకుంటున్నాను . ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బడుసు ప్రవీణ్, బక్కని అశోక్, ఆశపల్లి శంకరయ్య, బక్కని సిద్దు, పెంజర్ల బబ్లు, గుండెపు మహేందర్, తిరుమలి అరవింద్, కొండని శివ, పెంజర్ల నరేష్,బడుసు చంద్రయ్య, బక్కని సుమన్ బక్కని శంకరయ్య, ఎర్ర నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం




రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ–ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ–ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ–ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో–ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ–ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ–ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ–ఇంచార్జ్‌లను కేటాయించారు.మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ–ఇంచార్జ్‌లుగా నియమించారు.ఛత్తీస్‌గఢ్ – హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో–ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# వినయ్ భాస్కర్‌కు కేసీఆర్ ఫోన్

### - "తమ్ముడు వినయ్.. ఉద్యమ నాటి గుర్తులను మళ్లీ గుర్తు చేశావు"



**హనుమకొండ, సెప్టెంబర్ 23, హైదరాబాద్ ఎస్టేట్:**

ఎంజీఎం ఆస్పత్రి సందర్శన సందర్భంగా గాయపడిన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మంగళవారం రాత్రి ఫోన్‌లో పరామర్శించారు. వినయ్ భాస్కర్‌తో మాట్లాడిన కేసీఆర్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని, ప్రజలకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా "తమ్ముడు వినయ్.. ఉద్యమ నాటి గుర్తులను మళ్లీ గుర్తు చేశావు" అని కేసీఆర్ అన్నట్లు పేర్కొన్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో రోగులను పరామర్శించేందుకు వెళ్లిన వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఆయన గాయపడినట్లు ఆయన వర్గీయులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో కేసీఆర్ స్వయంగా ఫోన్‌లో పరామర్శించడం బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కూడా వినయ్ భాస్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

## సర్పంచ్ నవీన్ కు మర్యాదపూర్వకంగా కలిసిన నాయి బ్రాహ్మణులు

### - సంఘం సమస్యల గురించి సర్పంచికి తెలియజేసిన : నాయి బ్రాహ్మణులు



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 23:)**

మహేశ్వరం మండల కేంద్రంలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా మహేశ్వరం గ్రామ కమిటీ ఎన్నికైన శుభ సందర్భంగా మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామ నాయి బ్రాహ్మణులు మాట్లాడుతూ, గ్రామంలో యూనియన్ సమస్యల గురించి అలాగే నాయి బ్రాహ్మణ సంఘం కు స్థలం కేటాయించాలని యూనియన్ సమస్యల గురించి సర్పంచ్ మునగపాటి నవీన్ కు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల్ అధ్యక్షులు దూసకంటి ప్రభాకర్ నాయి , మండల ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల శివకుమార్ నాయి , గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ నాయి, ఉపాధ్యక్షుడు శంకర్ నాయి, సత్తయ్య నాయి, రాజు నాయి,బిఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షులు మహేందర్ నాయి,బబ్లు నాయి, శివ నాయి, మహేష్ నాయి, సురేష్ నాయి, సాయినాథ్ నాయి, పరమేష్ నాయి, బాలేష్ నాయి, కుమార్ నాయి, పాల్గొనడం జరిగింది

## జూకల్‌లో కోతుల బెడద.. అధికారులు వెంటనే స్పందించాలి

### ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న వానరాల సంచారం చర్యలు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి

జూకల్: జూకల్ గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామంలోని ఇళ్ల పరిసరాలు, వీధులు, పాఠశాలలు, రహదారుల వెంట గుంపులుగా సంచరిస్తున్న కోతులతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను తీసుకెళ్లడంతో పాటు, ఇంటి పైకప్పులు, విద్యుత్ తీగలపై సంచరిస్తూ ప్రమాదకర పరిస్థితులు సృష్టిస్తున్నాయి.

కోతుల గుంపులు ఒక్కసారిగా ప్రజలపైకి రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో కోతుల బెడద మరింత ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.

ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే వరకు అధికారులు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అటవీశాఖ, పంచాయతీ అధికారులు వెంటనే గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించి, కోతులను నియంత్రించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా.. ముందుగానే చర్యలు తీసుకోవాలని,



జూకల్ గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కలలకు కిరీటం.. జయ ప్రకాష్‌కు 'మిస్టర్ ఆంధ్ర' అవార్డు




**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు జయ ప్రకాష్ ఫ్యాషన్, మోడలింగ్ రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ ప్రతిష్టాత్మక 'మిస్టర్ ఆంధ్ర' అవార్డును అందుకున్నారు. 'మిస్టర్ అండ్ మిస్ గ్లామ్ గాలా' నిర్వహించిన పోటీల్లో జయ ప్రకాష్ ప్రతిభ కనబరిచి ఈ అవార్డును సొంతం చేసుకున్నారు.చిన్నప్పటి నుంచే ఫ్యాషన్, మోడలింగ్‌పై ఎంతో ఆసక్తి ఉన్న జయ ప్రకాష్.. అదే అభిరుచిని తన కెరీర్‌గా మలుచుకుంటూ ముందుకు సాగుతున్నారు. మోడలింగ్‌తో పాటు అందాల పోటీల్లో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకోవాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నారు.చదువుతో పాటు తన అభిరుచిని కొనసాగించడం కొన్ని సందర్భాల్లో సవాలుగా అనిపించినప్పటికీ, తన తల్లి అందించిన ప్రోత్సాహం, కుటుంబ సభ్యులు అందించిన సహకారం తనకు ఎంతో ధైర్యాన్నిచ్చాయని జయ ప్రకాష్ తెలిపారు. కుటుంబం తనపై ఉంచిన నమ్మకం వల్లే తన కలల వైపు ధైర్యంగా అడుగులు వేయగలిగానని పేర్కొన్నారు.ఈ పోటీల ప్రయాణంలో ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నానని, తనలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందని జయ ప్రకాష్ తెలిపారు. తనలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడంతో పాటు, లక్ష్యాన్ని సాధించేందుకు మరింత పట్టుదలతో ముందుకు సాగేందుకు ఈ ప్రయాణం ఎంతో ఉపయోగపడిందన్నారు.'మిస్టర్ అండ్ మిస్ గ్లామ్ గాలా మిస్టర్ ఆంధ్ర' అవార్డు అందుకోవడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన, భావోద్వేగమైన క్షణమని జయ ప్రకాష్ తెలిపారు. ఈ అవార్డు తన కష్టం, పట్టుదల, తన కలలపై ఉన్న నమ్మకానికి గుర్తుగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్‌లో మోడలింగ్, అందాల పోటీల రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జయ ప్రకాష్ తెలిపారు.

## కురుమ సోదరునికి ఆర్థిక సహాయం అందించిన .. కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కమిటీ.



**హైదరాబాద్ ఎస్టేట్ 22 08 2026 శనివారం ఎల్బీనగర్ .**

ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న మాల్గా శ్రీశైలం కురుమ గారిని వారి నివాసంలో కలిసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కుండే వెంకటేష్ కురుమ గారు మరియు కే వై సీ ఎస్ నాయకులు.ఈ సందర్భంగా శ్రీశైలం కురుమ గారికి ఆర్థిక సహాయం అందించి, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.కష్టకాలంలో ఉన్న కురుమ సోదరుడికి అండగా నిలిచి, మానవతా దృక్పథంతో సహాయం అందించిన కుండే వెంకటేష్ కురుమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందుల సత్యం కురుమ, కోశాధికారి రావుల ఐలయ్య కురుమ సలహాదారులు అది కృష్ణయ్య కురుమ, ఎల్ బి నగర్ అధ్యక్షులు కాల్నేమల్లేశం కురుమ, ఎల్ బి నగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలం శ్రీనివాస్ కురుమ, ప్రచార కార్యదర్శి బండారు శ్రీశైలం కురుమ, యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ కేమిడి ఉపేందర్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
24 సెప్టెంబర్ గురువారం 2026

## వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి
### కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు కుండె వెంకటేష్ కురుమ.

**హైదరాబాద్ ఎస్టేట్ 23 సెప్టెంబర్ 2026 ఎల్బీనగర్ బుధవారం**

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, ధీరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు కుండె వెంకటేష్ కురుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల హక్కుల కోసం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన మహనీయుడని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో దొడ్డి కొమురయ్యకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన సేవలను భావితరాలకు గుర్తుండేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టడం ద్వారా ఆయన త్యాగాన్ని గౌరవించడంతో పాటు, తెలంగాణ చరిత్రలో ఆయన పాత్రను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు అవుతుందని కుండె వెంకటేష్ కురుమ తెలిపారు.కాబట్టి తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టేలా తగిన నిర్ణయం



తీసుకోవాలని ఆయన కోరారు.

## పారిజాత నరసింహారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన భూసన్న గారి స్వామి

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 23:)**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గడ్డ నుండి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా.. పారిజాత నర్సింహారెడ్డి నియమితులైన సందర్భంగా.. మహేశ్వరం మండల్ క్రిస్టియన్ అధ్యక్షులు బుసన్న గారి స్వామి.. శుభాకాంక్షలు తెలియజేశారు మహేశ్వరం నియోజకవర్గం తో పాటు.. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా.. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు...

## అర్హులైన వారికి మాత్రమే ప్రభుత్వ పెన్షను

**కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 23**



మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని వెంకటాపూర్ బి గ్రామంలో నూతనంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను ఎంపీడీవో శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వెరిఫికేషన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, అర్హత ప్రమాణాల ప్రకారం పెన్షన్ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేవలం ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ఆధారంగానే కాకుండా, ఆన్‌లైన్ వెరిఫికేషన్‌తో పాటు ఫిజికల్ వెరిఫికేషన్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. దరఖాస్తుదారుల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వ పింఛన్ మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

పెన్షన్ పథకం ద్వారా అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందని, అయితే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారికే ఈ ప్రయోజనం వర్తిస్తుందని తెలిపారు. దరఖాస్తు సమయంలో సమర్పించిన వివరాలు, కుటుంబ పరిస్థితులు, ఆదాయం, ఆస్తులు తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆదాయపు పన్ను చెల్లించే వారు, నిబంధనలకు విరుద్ధంగా కారు వంటి వాహనాలు కలిగి ఉన్న వారు, ప్లాట్లు, భూములు లేదా ఇతర స్థిర, చర ఆస్తులు కలిగి ఉన్న వారు సంబంధిత అర్హత ప్రమాణాలను బట్టి పెన్షన్‌కు అనర్హులయ్యే అవకాశం ఉంటుందని ఎంపీడీవో వివరించారు. అర్హత లేని వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు తప్పుడు సమాచారం ఇవ్వకూడదని సూచించారు.అదేవిధంగా, అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోని వారు ప్రభుత్వం సూచించిన విధంగా దరఖాస్తు చేసుకోవాలని, అవసరమైన పత్రాలను సమర్పించాలని అధికారులు సూచించారు. గ్రామస్థాయిలో చేపడుతున్న వెరిఫికేషన్ ప్రక్రియలో అధికారులు అడిగే వివరాలను సక్రమంగా అందించి సహకరించాలని కోరారు.

వెంకటాపూర్ బి గ్రామంలో పెన్షన్ దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించిన అధికారులు, అర్హత ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ మంజూరుకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా పారదర్శకంగా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనజ శ్యాంసుందర్ రావు, సర్పంచ్ దుర్గమ్మ సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి రత్నం, ప్రభాకర్ గౌడ్, సుభాష్ గౌడ్, బాలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్తిశ్రద్ధలతో లంబోదరుని శోభాయాత్ర



మర్రిగూడ సెప్టెంబర్ 23 (హైద్రాబాద్ ఎస్టేట్):--

మర్రిగూడ మండలంలోని పలు గ్రామాలలో గణేశుని శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు మర్రిగూడ మండల కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేసి గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించారు బుధవారం లంబోధరుని శోభాయాత్రలో భాగంగా కలిశం వేలంపాట మరియు లడ్డు వేలం పాట చేశారు గ్రామాంలోని పురవీధుల నుంచి యువత మరియు మహిళలు బ్యాండ్ మేళాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు గణేశుని శోభాయాత్ర ఘనంగా జరిగింది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు కిష్టరాంపల్లి రిజర్వాయర్ వద్ద గణేష్ నిమజ్జనం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మూర్తి ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్ ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బురుగు. నాగరాజు గుప్త మిరియాల రఘురాములు అర్థం వేణు చందా మురళి మంచుకొండ రాంబాబు గజవల్లి రవికుమార్ గజవెల్లి బాలకృష్ణ నరసింహ దుగ్గి శ్రీను వూరె శేఖర్ అర్థం చంద్రమోహన్ అర్థం శ్రీనివాస్ మంచుకొండ రాము
బచ్చు జంగయ్య మహిళలు అర్థం ధనలక్ష్మి మిరియాల విమలమ్మ దుగ్గి ఝాన్సీ మంచుకొండ కనకదుర్గ చందా మాధవి మిరియాల పావని గజవెల్లి శిరీష గజవెల్లి చంద్రిక అర్థం లక్ష్మి వూరే గీత మంచుకొండ శిరీష బురుగు భారతమ్మ భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఎంజీఎం భద్రతపై సీపీఎం ధర్నా
### - పైకప్పు పెచ్చులు ఊడిపడి రోగులకు గాయాలు..
### - వరుస ఘటనలపై ఆందోళన

**వరంగల్, సెప్టెంబర్ 23, హైదరాబాద్ ఎస్టేట్:**

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రోగుల భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆసుపత్రి ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు సీలింగ్ పెచ్చులు ఊడిపడి పలువురు రోగులు, సిబ్బంది గాయపడిన ఘటన నేపథ్యంలో ఆసుపత్రిలో భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఆరోగ్యశ్రీ వార్డులో జరిగిన ఘటన మరువకముందే ఆసుపత్రిలోని ఇతర విభాగాల్లోనూ పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనలు చోటుచేసుకోవడంతో రోగులు, వారి బంధువుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చికిత్స కోసం వచ్చే రోగులకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన ఆసుపత్రిలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎంజీఎం ఆసుపత్రిలోని భవనాలను సమగ్రంగా పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. పైకప్పులు, సీలింగ్‌ల పరిస్థితిని పరిశీలించి లోపాలను సరిచేయడంతో పాటు రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా




తగిన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంజీఎంలో నెలకొన్న సమస్యలకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు కోరారు.

## రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి విచ్చేసిన పిట్టా వరప్రసాద్‌కు ఘన స్వాగతం

**విజయవాడ, సెప్టెంబర్ 23:**



రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి విజయవాడకు విచ్చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ గారికి పార్టీ యువ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా యువ నాయకులు శ్రీ దుర్గారావు, శ్రీ చిన్న, శ్రీ నాగార్జున, శ్రీ అనిల్ కుమార్, శ్రీ భాస్కర్ తదితరులు పిట్టా వరప్రసాద్ గారిని కలిసి స్వాగతం పలికారు.రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బలోపేతానికి యువత మరింత చురుకుగా ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

జై భీమ్!

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్)

## మందమర్రి కేకే ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించిన సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వరులు

**హైదరాబాద్ ఎస్టేట్ 23 సెప్టెంబర్**

మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ గనిని బుధవారం రోజు సాయంత్రం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె. వెంకటేశ్వరులు, ఏ. మనోహర్ (సిపి అండ్ పి) కార్పొరేట్ మరియు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ ప్రతినిధి బృందంతో కలిసి సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా గనిలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాలు, వేగవంతమైన రవాణా మార్గాలు మరియు కార్మికుల రక్షణ చర్యలను అధికారులను అడిగి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో డైరెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత త్రైమాసిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా చేరుకోవడానికి ఉత్పత్తి వేగాన్ని మరింత పెంచాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గనుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని



తగ్గించి, నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించవచ్చని తెలిపారు.అనంతరం ఎక్స్‌ప్రెస్ వే ఓబి కాంట్రాక్టర్లతో డైరెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఓబి తొలగింపు పనులను మరింత వేగవంతం చేయాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని ఆదేశించారు.

ఉత్పత్తి ఎంత ముఖ్యమో, ప్రతీ కార్మికుడి రక్షణ కూడా అంతే ముఖ్యం. ‘భద్రతతో కూడిన ఉత్పత్తే సమర్థవంతమైన ఉత్పత్తి‘. ప్రతీ ఒక్కరూ సురక్షితమైన వాతావరణంలో పనిచేసేలా అధికారులు అన్ని రక్షణ చర్యలు చేపట్టాలి.

సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రతీ కార్మికుడి పాత్ర కీలకమైనది. అధికారులు, ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ సిబ్బంది అందరూ ఒకే లక్ష్యంతో, సమన్వయంతో పనిచేసినప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోగలం. బొగ్గు తవ్వకాలతో పాటు గని పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంచడానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేకే ఓ సి పి ప్రాజెక్ట్ ఆఫీసర్, రాంబాబు, సేఫ్టీ అధికారి పైడయ్య, ఎస్ అండ్ పిసి (ఏ ఎస్ ఓ) వెంకటేశ్వర రెడ్డి, కేకే ఓ సి అధికారులు, ఎక్స్ ప్రెస్ వే కాంట్రాక్టర్స్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో దూండి గణపతి ఉత్సవాలకు హాజరైన మంత్రి నారా లోకేశ్



విజయవాడ నగరంలోని భవానీపురంలో దూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 72 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి లోకేశ్‌తో పాటు ఈ పూజా కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జ్ బుద్దా వెంకన్న, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు. దూండి గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకులు దూండి రాకేశ్, ఇతర ప్రతినిధులు మంత్రికి స్వాగతం పలికి, స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి ఏటా విజయవాడలో దూండి గణపతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. భారీ విగ్రహం, వైవిధ్యభరితమైన అలంకరణతో ఈ మండపం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ ఏడాది కూడా పర్యావరణ హితంగా 72 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
24 సెప్టెంబర్ గురువారం 2026

# వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### పోటీపడి రూ. 55 వేలకు గణపతి లడ్డూను దక్కించుకున్న భక్తుడు నితీష్



**హైదరాబాద్, సెప్టెంబర్ 23:** ప్రముఖ నగల వ్యాపార సంస్థ 'వాసవి గోల్డ్ అండ్ డైమండ్స్' ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల ముగింపు సందర్భంగా సంస్థ ఆవరణలో కొలువుదీరిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, హోమాలు, మహా మంగళహారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ వేడుకల్లో సంస్థ యాజమాన్యంతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుని దర్శించుకున్నారు.

పోటాపోటీగా లడ్డూ వేలం పాట:

పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాట అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు, సంస్థ ప్రతినిధులు తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు ఓ భక్తుడు నితీష్ గరిష్టంగా రూ. 55,000 (యాభై ఐదు వేల రూపాయలు) పలికి స్వామివారి దివ్య లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. భక్తి ప్రపత్తులతో లడ్డూను వేలంలో దక్కించుకున్న విజేతను సంస్థ యాజమాన్యం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపింది.

విజయాలు చేకూరాలని యాజమాన్యం ఆకాంక్ష:

ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాజు మడిపడిగే, సీఈవో సత్యవతి ప్రసన్న మాట్లాడుతూ.. లంబోదరుని ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. తమ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న సిబ్బందికి, ఆదరిస్తున్న వినియోగదారులకు ఈ సందర్భంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు (వీణం) ధీరజ్, సూరజ్ లతో పాటు వేణు, స్వాతి, అశ్విని, సాయి, సచిన్, నవనీత్, ఓంకార్, సుప్రజ, మౌనిక, పవన్, శ్రవణ్ మరియు సంస్థ సిబ్బంది అంతా పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులకు, అతిథులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీ చేశారు.

# ఉత్తరాంధ్ర తీరానికి చేరువైన తీవ్ర వాయుగుండం..

### అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర కోస్తాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది గంటల్లోనే తీరాన్ని దాటనుండటంతో ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) హెచ్చరించింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 7 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఇది ఉత్తరాంధ్ర తీరానికి అత్యంత సమీపంలో, కళింగపట్నానికి నైరుతి దిశగా 30 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఈశాన్యంగా 90 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.ఈ వాయుగుండం రానున్న 3 నుంచి 4 గంటల్లో విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య, కళింగపట్నానికి సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

వాయుగుండం ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, యానాంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా, ఉత్తర కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్నిసార్లు గాలి వేగం గంటకు 70 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపారు.రాయలసీమలోనూ అనేక చోట్ల తేలికపాటి జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. వాయుగుండం తీరం దాటిన తర్వాత క్రమంగా బలహీనపడుతుంది. సెప్టెంబర్ 24 తర్వాత వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన గాలులు కొనసాగవచ్చని అధికారులు సూచించారు. తీరప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.
వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో... విశాఖ, మన్యం, విజయనగరం జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

# ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళంకవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సేవాభావానికి పట్టం కట్టాలి

### రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ కుందూరు గోపాల్ రెడ్డి

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
హనుమకొండ కలెక్టరేట్:



2027 మార్చిలో జరగనున్న వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్, హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు కుందూరు గోపాల్రెడ్డి కోరారు. బుధవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడే సేవాభావం కలిగిన అభ్యర్థులను ఎన్నుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీ ప్రయోజనాలకు పరిమితమవుతున్నారని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా ప్రభుత్వాలతో సానుకూల సంబంధాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులు ఆలోచించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు పగడాల సరళ, శేషయ్య, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జగదీష్ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదారపు వాణిశ్రీ 'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ

### ప్రముఖ రచయిత్రి మాదారపు వాణిశ్రీ రచించిన 'పూటకూళ్ళవ్వ' నవల పుస్తకావిష్కరణ సభ దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్



హైదరాబాద్, 22.09.2026
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హిమాయత్ నగర్‌లోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్. రఘు అధ్యక్షత వహించగా, నవతెలంగాణ అసోసియేట్ ఎడిటర్ కె. ఆనందాచారి నవలను ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ ఆత్మీయ వాక్యాలు అందించగా, ప్రముఖ కవయిత్రి, విమర్శకురాలు డా. కొండపల్లి నిహారిణి నవలపై సమీక్ష చేశారు. కార్యక్రమాన్ని డా. ఇడికోజు శ్రీనివాసాచారి సమన్వయం చేశారు.అధ్యక్షత వహించిన డా. ఎస్. రఘు మాట్లాడుతూ 'పూటకూళ్ళవ్వ' నవల తనకు లిఆర్.కె. నారాయణ్ 'మాల్గుడి డేస్'లిను గుర్తు చేసిందన్నారు. సాధారణ జీవితం, మానవ సంబంధాలు, అనుబంధాలు, సంతోషాలు, సంఘర్షణలను రచయిత్రి సహజత్వంతో, కళాత్మకంగా చిత్రించారని పేర్కొన్నారు. రచయిత్రి సృష్టించిన పాత్రలు కల్పిత పాత్రల్లా కాకుండా పాఠకులకు పరిచయమైన మనుషుల్లా అనిపించేలా జీవంతో నిలిచాయని అన్నారు. పాత్రల మధ్య సంబంధాల ద్వారా మానవీయ విలువలను ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయమని, జీవితం పట్ల అవగాహన కలిగించే సందేశాత్మకమైన నవలగా 'పూటకూళ్ళవ్వ' నిలిచిందని పేర్కొన్నారు.నవలను ఆవిష్కరించిన కె. ఆనందాచారి మాట్లాడుతూ పుస్తకాలు సమాజాన్ని ప్రతిబింబించడంతో పాటు దానితో సంభాషిస్తాయని అన్నారు. రచయిత చుట్టూ ఉన్న జీవితాన్ని నిశితంగా పరిశీలించినప్పుడే సహజమైన పాత్రలు, విశ్వసనీయమైన సంఘటనలు సాహిత్యంలో రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. 'పూటకూళ్ళవ్వ'లో జీవన వాస్తవికతకు, మానవ సంబంధాలకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. రచయిత్రి మాదారపు వాణిశ్రీకి అభినందనలు తెలిపారు.మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ సాహిత్య సృజనను ప్రోత్సహించడం, కొత్త రచనలను పాఠకులకు పరిచయం చేయడం సాహిత్య సంస్థల బాధ్యతల్లో భాగమని అన్నారు. సమాజంలోని అనుభవాలను సాహిత్యంగా మలిచే రచయితలకు ప్రోత్సాహం అవసరమని పేర్కొంటూ, 'పూటకూళ్ళవ్వ' పాఠకాదరణ పొందాలని ఆకాంక్షించారు.డా. కొండపల్లి నిహారిణి నవలపై సమీక్ష చేస్తూ ఇతివృత్తం, పాత్రల నిర్మాణం, కథన పద్ధతి, భాష, శైలి, మానవ సంబంధాల చిత్రణను విశ్లేషించారు. పాత్రలు కథను ముందుకు నడిపించే సాధనాలుగా కాకుండా స్వతంత్ర వ్యక్తిత్వంతో రూపుదిద్దుకున్నాయని అన్నారు. పాత్రల మధ్య సంబంధాలు, వాటి ద్వారా వ్యక్తమయ్యే భావోద్వేగాలు, ఆనందాలు, సంఘర్షణలు నవలకు జీవం పోశాయని పేర్కొన్నారు. సహజమైన కథనం, కళాత్మకమైన రచనా శైలి నవలకు ప్రత్యేకతను అందించాయని అభిప్రాయపడ్డారు.రచయిత్రి మాదారపు వాణిశ్రీ మాట్లాడుతూ తన చుట్టూ కనిపించిన జీవితం, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులు, జీవన అనుభవాలే 'పూటకూళ్ళవ్వ' రచనకు ప్రేరణగా నిలిచాయని తెలిపారు. నవలను ప్రచురించి పాఠకుల ముందుకు తీసుకువచ్చిన దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్‌కు, పుస్తకావిష్కరణ సభకు హాజరైన సాహితీవేత్తలు, కవులు, రచయితలు, పరిశోధకులు, సాహిత్యాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.
'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ సభకు పలువురు ప్రముఖ రచయితలు, సాహితీవేత్తలు, పరిశోధకులు హాజరయ్యారు. కూరెళ్ల శ్రీనివాస్, అంబటి వెంకన్న, మందరపు హైమావతి, జుగాష్ విలి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధకులు పల్లె సతీష్, నరేష్ భూక్యా, మధుసూదన్ తదితరులు పాల్గొని రచయిత్రికి అభినందనలు తెలిపారు.
సాహిత్య చర్చలు, సమీక్షలు, అభినందనల మధ్య జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభ 'పూటకూళ్ళవ్వ' నవలను పాఠకులకు పరిచయం చేయడంతో పాటు సమకాలీన తెలుగు నవలా సాహిత్యంలో మానవ జీవితం, సంబంధాలు, అనుభవాల ప్రాధాన్యాన్ని చర్చకు తెచ్చింది.

సైయ్యద్ ఖిజర్
కోఆర్డినేటర్ దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్
మొబైల్ : 9030626288

# కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

### - పాల్గొన్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ రావు





హైదరాబాద్, సెప్టెంబర్ 23:
కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు అన్నవితరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ, దాతృత్వం కేవలం ఒక చర్య మాత్రమే కాదని, సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.
ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన నాయకులు హరి, సాయి, సంతోష్, నరేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లో కొలువుదీరిన గణనాథుడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కేటీఆర్‌తో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తలసాని సాయి కిరణ్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మరో సారి కేసీఆర్ ముఖ్య మంత్రి కావాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# గణనాథుని సన్నిధిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

## భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామ ప్రజలు

కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 23
మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని వెంకటాపూర్ బి గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం సమీపంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణనాథుని సన్నిధిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గణనాథుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు గ్రామ ప్రజలకు నిర్వాహకులు అన్నప్రసాదాలను వడ్డించారు. భక్తులు, గ్రామస్తులు సంతోషంగా అన్నప్రసాదాలను స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాత కీ.శే. భూమయ్య సేట్ కుమారుడు శ్రీనివాస్ సేట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణనాథుని ఆశీస్సులతో







గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామ ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని బలపరుస్తాయని పలువురు పేర్కొన్నారు.అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు సహా పలువురు భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజల సహకారం, భాగస్వామ్యంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనజ శ్యాంసుందర్రావు, సర్పంచ్ దుర్గమ్మ సత్తయ్య, ప్రభాకర్ గౌడ్, సుభాష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, మధుసూదన్ రెడ్డి, సురేష్, ముత్యాలు, పండరి, శంకర్ గౌడ్, నబి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుని ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలి

## ఆర్గనైజర్ రాములు గౌడ్

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్**
**23 సెప్టెంబర్ 2026 , బుధవారం**

నెలపట్లలో 5ఖ రన్/వాక్‌కు రంగం సిద్ధం
ఆరోగ్యమే మహాభాగ్యండ ఐక్యతతో అడుగులు వేయడానికి ప్రజలకు ఆహ్వానం

ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు యువత, మహిళలు, విద్యార్థులు, కుటుంబ సభ్యుల్లో ఫిట్‌నెస్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు "నెలపట్ల 5ఖ రన్/వాక్ దీశీతీఅ్ శీ =బఅ" కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు నెలపట్లలోని రాయల్ గార్డెన్స్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది.

ప్రతిరోజూ వేగంగా మారుతున్న జీవనశైలిలో శారీరక వ్యాయామానికి ప్రాధాన్యత తగ్గుతున్న నేపథ్యంలో ప్రజలను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ 5ఖ రన్/వాక్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉదయాన్నే ఉత్సాహభరిత వాతావరణం

ఆదివారం తెల్లవారుజామున 6 గంటలకే కార్యక్రమం ప్రారంభం కానుండటంతో నెలపట్ల పరిసరాల్లో ప్రత్యేక సందడి నెలకొననుంది. రన్‌లో పాల్గొనే వారు ఉత్సాహంగా పరుగులు తీయడంతో పాటు, పరుగెత్తలేని వారు వాకింగ్ ద్వారా కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చు.

"=బఅ c ఔెశ్రీని c దీవ ఎముశ్రీష్ట్రఎ c దీవ ఎశీస్త్రవ్‌ష్ట్రవతీ" అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యం, సామాజిక ఐక్యత, స్నేహభావం, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో సానుకూల సందేశాన్ని తీసుకెళ్లాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

₹100కే రిజిస్ట్రేషన్ ఆకర్షణీయమైన బహుమతులు

ఈ 5ఖ రన్/వాక్‌లో పాల్గొనే వారి కోసం రిజిస్ట్రేషన్ ఫీజును కేవలం ₹100గా నిర్ణయించారు. పాల్గొనే ప్రతి రిజిస్టర్డ్ పార్టిసిపెంట్‌కు పలు ఆకర్షణీయమైన సదుపాయాలను అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

పాల్గొనేవారికి లభించేవి:

1. టీ-షర్ట్
2. మెడల్
3. బ్రేక్‌ఫాస్ట్

అందరికీ ఆరోగ్యకరమైన ఉదయాన్ని అందించడంతో పాటు, కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా పాల్గొనే అవకాశం

ఈ కార్యక్రమం కేవలం ప్రొఫెషనల్ రన్నర్లకే పరిమితం కాకుండా యువత, విద్యార్థులు, మహిళలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఫిట్‌నెస్‌పై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనేలా రూపొందించారు.

ఒకే వేదికపై వివిధ వయసుల వారు కలిసి పరుగెత్తడం, నడవడం ద్వారా ఆరోగ్యంతో పాటు సామాజిక అనుబంధాన్ని పెంపొందించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

"ఆరోగ్యం కోసం ఒక అడుగుడ ఐక్యత కోసం మరో అడుగు"

ప్రస్తుత కాలంలో చిన్న వయసులోనే జీవనశైలి సంబంధిత సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిరోజూ కొంత సమయం నడక, పరుగు వంటి శారీరక వ్యాయామానికి కేటాయించడం అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు.

5 కిలోమీటర్ల పరుగు లేదా నడక ద్వారా శారీరక చురుకుదనాన్ని పెంచుకోవడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఒక మంచి ప్రారంభం చేయవచ్చని తెలిపారు.



కార్యక్రమ వివరాలు

కార్యక్రమం: నెలపట్ల 5ఖ =బఅ/ఔెశ్రీని
తేదీ: 27 సెప్టెంబర్ 2026, ఆదివారం
సమయం: ఉదయం 6:00 గంటలకు
వేదిక: రాయల్ గార్డెన్స్, నెలపట్ల
రిజిస్ట్రేషన్ ఫీజు: ₹100
ఆర్గనైజర్: ూా= +శీబఎ
ఫోన్: 99482 22212

రిజిస్ట్రేషన్ కోసం పోస్టర్‌లో ఉన్న ూ= కోడ్‌ను స్కాన్ చేసి నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

"రండిడ పరుగెత్తండిడ నడవండిడ ఆరోగ్యంగా ఉండండి!"

నెలపట్ల 5ఖ =బఅ/ఔెశ్రీని కార్యక్రమం కేవలం ఒక పరుగు కార్యక్రమం మాత్రమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించే సామూహిక కార్యక్రమంగా నిలవాలని నిర్వాహకులు ఆకాంక్షిస్తున్నారు.

"ఒక్కరి కోసం కాదుడ అందరి ఆరోగ్యం కోసం. ఒక్క అడుగు కాదుడ ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు వేల అడుగులు."

అనే స్ఫూర్తితో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఆరోగ్యం కోసం పరుగెత్తుదాండ ఐక్యత కోసం కలిసి నడుద్దాం!

# చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు: జగన్

**– విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్**

**– కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ**

**– ప్రతి గ్రామంలో మద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు**

వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు.
ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు



ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం.. ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళు ,, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశు ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొత్స అనూష



వైసీపీ అధినేత జగన్‌ను భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ నూతన సమన్వయకర్త బొత్స అనూష మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె జగన్ తో సమావేశమయ్యారు. ఇటీవలే భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె అనూషను పార్టీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. గతంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీని వీడటంతో, స్థానిక క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేసే బాధ్యతను జగన్ ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను కట్టబెట్టినందుకు పార్టీ అధినేత జగన్‌కు అనూష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.భేటీ అనంతరం అనూష మాట్లాడుతూ... నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి, శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

# అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు



ఏపీ రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థకు అంకురార్పణ జరిగింది. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద నిర్మించనున్న ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ (ూఃూజు×) నూతన ప్రాంగణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటవుతున్న ఈ కంటి ఆసుపత్రి ప్రపంచంలోనే నంబర్ వన్ సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు. "రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. భవిష్యత్తు అంతా ఆవిష్కరణలదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. ఆ దిశగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు ఒక కీలక ముందడుగు" అని అన్నారు. ఈ సంస్థ కోసం అమరావతిలో 12 ఎకరాల భూమిని కేటాయించినట్లు ఆయన వెల్లడించారు.

**భవిష్యత్ ఆరోగ్య సంరక్షణే లక్ష్యం**

ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటు చేయబోయేది కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, ఇది 'ఫ్యూచరిస్టిక్ హెల్త్‌కేర్' కేంద్రమని వివరించారు. అధునాతన టెర్షియరీ కేర్‌తో పాటు, పుట్టుకతో వచ్చే అంధత్వాన్ని నివారించేందుకు, ప్రపంచవ్యాప్తంగా యువతలో పెరిగిపోతున్న మయోపియా (దూరదృష్టి లోపం) సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఆసుపత్రి ప్రాంగణానికే పరిమితం కాకుండా ఇంటి వద్దకే వైద్య సేవలు, దీర్ఘకాలిక పునరావాస సేవలను కూడా అందిస్తామని పేర్కొన్నారు.ఈ లక్ష్య సాధన కోసం అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న ప్రఖ్యాత 'పెర్కిన్స్ స్కూల్ ఫర్ ది బ్లైండ్'తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. విశ్వవిఖ్యాత హెలెన్ కెల్లర్, ఆమె గురువు యాన్ సుల్లివన్ విద్యాభ్యాసం చేసింది కూడా ఇదే పాఠశాలలో కావడం విశేషం. ఈ భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సేవలను అమరావతి కేంద్రంగా అందించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
24 సెప్టెంబర్ గురువారం 2026

# అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు.. కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

## : మంత్రుల భేటీలో నారా లోకేశ్



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ, అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులపై గూండాలతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.

# ఈశ్వరచంద్ర విద్యాసాగర్ సామాజిక సంస్కరణకు వెలుగుదీపం

## మహిళా విద్య, వితంతు పునర్వివాహం కోసం అలుపెరగని పోరాటం



సెప్టెంబర్ 24 ప్రత్యేకం:
భారత సామాజిక సంస్కరణ చరిత్రలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించదగినది. 1820 సెప్టెంబర్ 26న బెంగాల్‌లో జన్మించిన ఆయన విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, రచయితగా సమాజానికి విశేష సేవలందించారు.

ఆ కాలంలో సమాజంలో నెలకొన్న అనేక మూఢనమ్మకాలు, అసమానతలకు వ్యతిరేకంగా విద్యాసాగర్ గళమెత్తారు. ముఖ్యంగా మహిళలకు విద్య అందించడంతో పాటు వితంతు పునర్వివాహానికి చట్టబద్ధత కల్పించేందుకు ఆయన చేసిన కృషి విశేషమైనది.

### మహిళా విద్యకు పెద్దపీట

మహిళలకు విద్య అవసరం లేదనే భావనలు బలంగా ఉన్న సమయంలో విద్యాసాగర్ బాలికల విద్య కోసం ఉద్యమించారు. బాలికల కోసం పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసి, మహిళా సాధికారతకు విద్యే పునాది అని నిరూపించారు.

### వితంతు పునర్వివాహం కోసం పోరాటం

వితంతువుల దయనీయ పరిస్థితులను చూసి చలించిన విద్యాసాగర్, వారి పునర్వివాహానికి చట్టబద్ధత కల్పించేందుకు ఉద్యమించారు. ఆయన కృషి ఫలితంగా 1856లో హిందూ వితంతు పునర్వివాహ చట్టం అమలులోకి వచ్చింది. ఇది భారత సామాజిక సంస్కరణ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది.

### "విద్యాసాగర్"గా గుర్తింపు

సంస్కృత విద్యలో ఆయనకు ఉన్న అపారమైన పాండిత్యానికి గుర్తింపుగా "విద్యాసాగర్" అనే బిరుదు లభించింది. విద్య పట్ల ఆయనకున్న అంకితభావం, పేదలు మరియు అణగారిన వర్గాల పట్ల ఆయన చూపిన మానవతా దృక్పథం ఆయనను ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపాయి.
సంఘ సంస్కరణలు
విధవా పునర్వివాహ చట్టం: భారతదేశంలో వితంతు పునర్వివాహాల కోసం తీవ్రంగా పోరాడి, 1856లో హిందూ విడోస్ రీమ్యారేజ్ యాక్ట్ (ఎఊఅఎబ ౕఊఎశీఽం' =వుఖీతీతీఋస్త్రవ ూౌఛి, 1856) ఆమోదించడంలో కీలక పాత్ర పోషించారు.
స్త్రీ విద్య: బాలికల విద్యను ప్రోత్సహించడానికి అనేక పాఠశాలలను స్థాపించారు. బాల్ వివాహాలు, బహు భార్యత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.
కుల వివక్ష వ్యతిరేకత: కలకత్తాలోని సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కాలంలో, ఆ కళాశాల ద్వారాలను కులమతాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల విద్యార్థులకూ తెరిచారు.

### నేటి తరానికి స్ఫూర్తి

సమాజంలో మార్పు రావాలంటే విద్య, సమానత్వం, మానవతా విలువలు పెంపొందాలని విద్యాసాగర్ తన జీవితంతో చాటిచెప్పారు. మహిళలకు విద్య, గౌరవం, సమాన అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషి నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకం.

రచన
దేవర సాగర్ ౹ాూ తెలుగ్స్ాూ కొమ్మాల
9701274596

# 'ఇంత పెద్ద ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనం?'..

## జగన్‌పై అచ్చెన్నాయుడు ఫైర్



మద్యం కుంభకోణం ఆరోపణలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. 2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించారని విమర్శించారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో రూ.3,200 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం సిట్ దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. సిట్ దర్యాప్తులో మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలపై పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.మాజీ ఏపీఎస్‌బీసీఎల్ ఓఎస్డీ డి.సత్యప్రసాద్ ఏసీబీ కోర్టులో ఇచ్చిన వాంగ్మూలాన్ని అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలు అప్పటి ముఖ్యమంత్రి నివాసంలోనే తీసుకున్నట్లు ఆయన వాంగ్మూలంలో పేర్కొన్నారని చెప్పారు. ఈ ఆరోపణలపై జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. సత్యప్రసాద్ గతంలో ప్రభుత్వ వ్యవస్థలో కీలక బాధ్యతల్లో పనిచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇప్పుడు ఆయన వాంగ్మూలాన్ని ప్రశ్నించడం సరికాదని అన్నారు.మద్యం సరఫరాలో నగదు లావాదేవీలపై కూడా అచ్చెన్నాయుడు ప్రశ్నలు లేవనెత్తారు. 2019-24 మధ్య మద్యం విక్రయాలు, బ్రాండ్ల ఎంపిక, సరఫరా విధానంలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మద్యం రవాణా కాంట్రాక్టుల్లోనూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. రవాణా టెండర్లలో అవకతవకలతో రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.192 కోట్ల నష్టం జరిగిందన్న దర్యాప్తు ఆరోపణలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి.ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఆరోపణలపైనా జగన్ సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు కోరారు. మద్యం విధానంలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలు, నగదు లావాదేవీలు, సరఫరా వ్యవహారాలపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. "ఇంత పెద్ద ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదు?" అంటూ ప్రశ్నించారు.

# ఉద్యోగ, కార్మిక పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

## : అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌లి

### - గోషామహల్ లో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించిన మధుయాష్కీ గౌడ్

హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్



ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతి అని, వారి సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ గారు తెలిపారు. హైదరాబాద్లోని గోషామహల్ లో బుధవారం జలమండలి గుర్తింపు కార్మిక సంఘం 'తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్' కార్యాలయాన్ని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ చక్రధర్ రెడ్డి లతో కలిసి మధుయాష్కీ గౌడ్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కోటి మంది కార్మికులకు కనీస వేతనాలను అమలులోకి తీసుకవచ్చిందని చెప్పారు. ఇప్పటికే జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిస్కారం అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ను గెలిపించాలని మధుయాష్కీ గౌడ్ గారు కోరారు.

మొగుళ్ళ రాజిరెడ్డి గారు మాట్లాడుతూ.. జలమండలి కార్మికులకు అండగా ఉన్నట్లే ఇతర కార్మికుల సమస్యలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. జలమండలిలో ఇంకా పరిష్కరంకాని రెండు మూడు సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తుందని చెప్పారు. జలమండలి కార్మికులు అధికార పార్టీ గుర్తింపు సంఘాన్ని గెలిపించినట్లుగానే ఆర్టీసీ కార్మికులు సైతం కాంగ్రెస్ మద్దతు ఇస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని మొగుళ్ళ రాజిరెడ్డి గారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలోతెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఈ. అశ్వథామ రెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. టి. రాఘవేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ లు అల్లి శ్రవణ్ కుమార్, ఎండి. జహంగీర్, నాయకులూ సయ్యద్ అక్తర్ అలీ, ఆనంద్ రెడ్డి, అశోక్, చంద్రశేఖర్, ఏం. రాజా, నర్సింగ్ రావు, పి. చంద్రశేఖర్, ఏం. రాంచందర్, బి. మహేష్, అజైనాథ్, జైరాజ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.








